సాక్షి చిత్తూరు

సోమవారం । 1 । ఏప్రిల్ । 2024



బోయకొండలో భక్తుల రద్దీ

బోయకొండ గంగమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా రావడంతో జన సంద్రమైంది. - 8లో



కంటైనర్- కారు ఢీ

ముందువెళ్తున్న కంటైనర్‌ను ఢీకొనడంతో తల్లీ ఇద్దరు కుమారులు గాయపడిన సంఘటన బంగారుపాళెంలో జరిగింది. - 8లో



న్యూస్‌రీల్

బస్సు యాత్రను విజయవంతం చేయండి

కుప్పం: జిలాల్లో జరగనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ భరత్ కోరారు. ఆదివారం ఆయన వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ నెల 2, 3, 4 తేదీల్లో జిల్లాలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బస్సు యాత్రలో పర్యటిస్తున్నట్లు ఆయన తెలిపారు. కుప్పం నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఆయన సూచించారు.

రికార్డు స్థాయిలో ఆస్తి పన్ను వసూలు



చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

చిత్తూరు అర్బన్: వడ్డీలేకుండా ఆస్తిపన్నును చెల్లించడానికి ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని చిత్తూరు నగర వాసులు ఉపయోగించుకోవడంతో.. చిత్తూరులో రికార్డుస్థాయిలో ఆస్తి పన్ను వసూలైంది. ఆస్తిపన్నుపై ప్రభుత్వం వడ్డీమాఫీ చేయడంతో, ఈ అవకాశం ఆదివారంతో ముగిసింది. చివరి రోజున చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌కు సుమారు రూ.1.50 కోట్ల వరకు ఆస్తిపన్ను వసూలైంది. రాష్ట్ర ప్రభుత్వం గత నెల రోజులుగా పన్నులు చెల్లించడానికి వడ్డీని మాఫీ చేయడంతో చిత్తూరులో మొత్తంగా దాదాపు రూ.5.20 కోట్లు పన్నుల రూపంలో వసూలయ్యాయి. వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ కింద అదనంగా రూ.31 లక్షల వరకు వచ్చింది. మున్సిపల్ ఖజానాకు ఇంత మొత్తం జమకావడంతో అధికారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రూ.5 కోట్లు వసూల్

చిత్తూరు కార్పొరేషన్: ఆదివారం ప్రభుత్వ సెలవు దినం అయినప్పటికీ జిల్లాలో విద్యుత్ వసూలు కేంద్రాలు పని చేశాయని ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. దీంతో మొత్తం రూ.5 కోట్లు విద్యుత్ బిల్లులు చెల్లింపుల ద్వారా వసూలు అయినట్లు చెప్పారు.

'ఆ టీచర్లపై చర్యలుంటాయ్'

చిత్తూరు కలెక్టరేట్ : పదో తరగతి మూల్యాంకనం విధులకు రిపోర్టు చేసుకోని టీచర్లపై శాఖాపరమైన చర్యలుంటాయని డీఈఓ దేవరాజు వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం నుంచి జిల్లా కేంద్రంలో పదో తరగతి మూల్యాంకనం జరుగుతుందన్నారు. ఈ మూల్యాంకనం విధులకు ఉత్తర్వులు అందిన అన్ని సబ్జెక్టుల టీచర్లు తప్పనిసరిగా సోమవారం రిపోర్టు చేసుకోవాలన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో భక్తులు సేవా ఏటీసీహెచ్ వరకు బారులు తీరారు. శుక్రవారం అర్ధరాత్రి వరకు 79,907 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 34,037 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. హుండీల ద్వారా రూ.4.05 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

ఆపద్బాంధవి.. వాహనమిత్ర



రాష్ట్రప్రభుత్వం శ్రమ జీవులకు, స్వయం ఉపాధి రంగాలపై ఆధారపడి బతికే వారి పాలిట ఆపద్బాంధవిలా నిలిచింది. ముఖ్యంగా ఆటోలు, ట్యాక్సీ డ్రైవర్లకు వైఎస్సార్ వాహనమిత్ర పథకం ద్వారా ఆర్థికసాయం అందించి ఆర్థిక చేయూతనిచ్చింది. వాహన ఇన్సూరెన్స్, రిపేర్లు, సర్వీసింగ్ వంటి ఖర్చుల నుంచి కాస్త ఉపశమనం ఇచ్చేలా ఏటా రూ.10 వేలు చొప్పున ఐదేళ్లు సాయం అందించింది. ఏటా ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు శ్రమజీవులకు మరిన్ని సంక్షేమ పథకాలు అందడంతో వారి కుటుంబాల్లో వెలుగులు నిండాయి.

- వైఎస్సార్ వాహనమిత్ర పథకంతో ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు ఏటా రూ.10 వేలు అందించిన ప్రభుత్వం
- జిల్లాలో 6 వేల మందికి పైగా లబ్ధి
- ఐదేళ్లలో రూ.31.16 కోట్ల సాయం
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

చిత్తూరు రూరల్: స్వయం ఉపాధిపై ఆధారపడి జీవించే ఆటోలు, ట్యాక్సీలు, క్యాబ్ డ్రైవర్లు ఏ రోజుకారోజు వచ్చే ఆదాయంతో కుటుంబాలను పోషించుకుంటారు. వీరి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కావడంతో వాహనాలకు బీమా చెల్లించలేని పరిస్థితి. వాహనాలకు మరమ్మతులు చేయాలన్నా అప్పులు చేయాల్సి వస్తోంది. వాటిని తీర్చడానికి మరింత అప్పుల పాలవుతున్నారు. అరకొర ఆదాయంతో జీవనం సాగించే వీరి కుటుంబాలకు చేయూతనివ్వాలని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాణం పోశారు. పాదయాత్రలో ఉండగా 2018 మే 14న తాను అధికారంలోకి వచ్చాక ఆర్థికసాయం అందిస్తానని ప్రకటించారు. ఆ ప్రకారమే అధికారంలోకి వచ్చాక 2019 అక్టోబర్ 14న వైఎస్సార్ వాహన మిత్ర పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకం కింద ఏటా ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు రూ.10 వేల చొప్పున ఇస్తున్నారు. ఈ సొమ్ముతో వారు వాహనాల ఫిట్‌నెస్, మరమ్మతులు, బీమా తదితర అవసరాలు తీర్చుకుంటారన్న సంకల్పంతో క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారు. ఈ సొమ్మును వారి బ్యాంకు ఖాతాల్లోనే నేరుగా జమ చేస్తున్నారు. దీంతో గడచిన ఐదేళ్లుగా వీరు ఎంతో సంతోషంగా ఉన్నారు. గతంలో తమ కోసం ఇంతలా ఆలోచించిన ముఖ్యమంత్రులు లేరని ఈ వాహన మిత్ర లబ్ధిదారులు తెలిపారు. అందుకే తమకు ఆర్థికంగా దన్నుగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌కు ఎప్పుడూ రుణపడి ఉంటామని, అండగా నిలుస్తామని చెబుతున్నారు. జిల్లాలో సుమారు 6వేల మందికిపైగా వాహనమిత్ర పథకం కింద సాయం అందుకున్నారు. వీరికి ఈ ఐదేళ్లలో రూ.31.16 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించి అండగా నిలిచింది.

వాహనమిత్ర వివరాలు

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	మంజూరు రూ.కోట్లల్లో
2019-2020	5879	5.87
2020-2021	6674	6.67
2021-2022	6105	6.10
2022-2023	6044	6.04
2023-2024	6482	6.48

అప్పుల బాధ తప్పింది..



నేను 15 ఏళ్లుగా ఆటో నడుపుతున్నా. మా కుటుంబంలో నలుగురు ఉన్నాం. ఐదేళ్ల కిందటి వరకూ కుటుంబ పోషణ చాలా కష్టంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఆటో కార్మికులకు వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా వరుసగా ఐదేళ్ల పాటు ఏడాదికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.50 వేలు నా ఖాతాలో జమ చేశారు. కరోనా కష్టకాలంలో కూడా సీఎం జగనన్న రూ.10 వేల సాయం అందించారు. వాహనమిత్ర డబ్బుతో ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకుని ధైర్యంగా ఆటోనడుపుతున్నా.

– రామ్మూర్తి, ఆటో డ్రైవర్, జీడీనెల్లూరు

వాహనమిత్ర తోడైంది..



నేను 2022లో సొంతంగా ఆటో కొనుక్కున్నా. ఆటో నడిపితే ప్రతి రోజు ఖర్చులు పోను రూ.300 వరకు మిగిలేది. ఆటోకు ఏటా ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ తప్పనిసరిగా చేసుకోవాలి. సర్వీస్‌లో వచ్చిన డబ్బు వడ్డీలకు, ఆటో రిపేరీకి సరిపోయేది. ఈ ప్రభుత్వం వచ్చాక మాకు వాహన మిత్రతో పాటు అమ్మఒడి కింద రూ.57 వేలు, రైతు భరోసా కింద ఏటా రూ.13,500, ఇంటి స్థలం ఇచ్చారు. దాని విలువ రూ.2.50 లక్షలు ఉంటుంది. అలాగే వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ కూడా వచ్చాయి. మాకు ఈ ప్రభుత్వం అండగా నిలిచింది.

– అమ్ములు, చిత్తూరు

ఆర్థికంగా సాయపడుతున్నారు..



7 ఏళ్లుగా ఆటో నడుపుతున్నా. ఆటో నడిపి వచ్చే ఆదాయంతో భార్య, పిల్లలను పోషించుకుంటున్నా. గతంలో అయితే ఆటో నడిపి వచ్చే ఆదాయంతో గిట్టుబాటు అయ్యేది కాదు. ఏటా ప్రభుత్వం అందించే వాహన మిత్ర డబ్బులు నా అవసరాలను ఆదుకుంటున్నాయి. కుటుంబ భారం నుంచి బయటపడుతున్నా. కొత్త రేషన్‌కార్డు వచ్చింది. అలాగే ఇంటి స్థలం కూడా ఇచ్చారు. మాకు ఈ ప్రభుత్వంలో చాలా మేలు జరిగింది. ఎప్పటికీ ఈ సాయం మరువం.

– రాజశేఖర్, చిత్తూరు

పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయండి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి భీమారావు

చిత్తూరు అర్బన్: జిల్లాలోని పలు న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించేదిశగా న్యాయమూర్తులు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు అన్నారు. ఆదివారం చిత్తూరు నగరంలోని జెడ్పీ మీటింగ్ హాలులో న్యాయపరిపాలన, సివిల్-క్రిమినల్ కేసుల పరిష్కారం అనే అంశంపై ఉమ్మడి జిల్లాలోని న్యాయమూర్తులను అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా జడ్జి మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారం కోసం సుప్రీంకోర్టు ఆదేశాలతో ఇప్పటికే లోక్‌అదాలత్‌లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే న్యాయస్థానాల్లో దీర్ఘకాలికంగా ఉన్న కేసుల పరిష్కారానికి న్యాయమూర్తులు చొరవ చూపాలన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 63 న్యాయస్థానాలు ఉంటే ఈ ఏడాది ఫిబ్రవరి చివరినాటికి జిల్లాలో 91,221 కేసులు పెండింగ్‌లో ఉండగా, ఇందులో 46,938 సివిల్, 44,283 క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపారు. కేసుల పరిష్కారానికి కలెక్టర్, ఎస్పీలతో సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. 2019 కంటే ముందున్న పెండింగ్ కేసుల కోసం ఈ కమిటీ ఓ ప్రణాళిక రూపొందించుకుని ముందుకు వెళ్లాలన్నారు.

పూర్తి కావొస్తున్న బహుళ అంతస్తు..

జిల్లాకేంద్రం చిత్తూరులో 15 న్యాయస్థానాలు కలిపి ఒకే బహుళ అంతస్తులో ఉండేలా నిర్మిస్తున్న భవనం పనులు పూర్తి కావచ్చాయని, పాకాల, మదనపల్లెలో నూతనంగా నిర్మించిన న్యాయస్థానాలను త్వరలోనే ప్రారంభిస్తామని జడ్జి భీమారావు తెలిపారు. లోక్‌అదాలత్‌లో కేసుల పరిష్కారం గణాంకాలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. జిల్లాలో అత్యధికంగా కేసులు పరిష్కరించిన జడ్జిలను ఆయన అభినందించారు. సమావేశంలో రమేష్, అన్వర్ బాషా, శాంతి, కరుణకు మార్, శ్రీదేవి, వెన్నెల, ఉమాదేవి, మాధవి, శ్రీనివాసమూర్తి, న్యాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

- 3న పూతలపట్టుకు సీఎం వైఎస్ జగన్
- మూర్తిగానూరు వద్ద భారీ బహిరంగ సభ
- ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి పెద్దిరెడ్డి



సభా స్థలిని పరిశీలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పూతలపట్టు: బస్సు యాత్రలో భాగంగా బుధవారం జిల్లాకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేయనున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం పూతలపట్టు మండలం, మూర్తిగానూరు వద్ద నిర్వహించే భారీ బహిరంగ సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మేము సిద్ధం-బస్సు యాత్రలో భాగంగా బుధవారం పూతలపట్టు మండలంలో పర్యటిస్తారని తెలిపారు. అనంతరం మూర్తిగానూరు వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొంటారని చెప్పారు. సభా ప్రాంగణంలో అత్యవసర వసతులను ఏర్పాటు చేయాలని, పోలీసులు గట్టి బందోబస్తు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. అనంతరం ఆయన నాయకులతో మాట్లాడుతూ సీఎం జగన్ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. వలంటీర్లపై చంద్రబాబు మరోసారి కుట్ర బయటపడిందని తెలిపారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి, 2024 ఎన్నికల వేళ ప్రజల వద్దకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నారని తెలిపారు. చంద్రబాబు లాగా ఎన్నికలకు ముందు ఒకలా, ఎన్నికల తరువాత ఇంకోలా నడుచుకోవడం తెలియదన్నారు. 2010 నుంచి పూతలపట్టు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురుతోందని, 2024లో కూడా మనమే గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్, పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, పాలఏకరి చైర్మన్ కుమారరాజ, కనీ్వనర్లు శ్రీకాంత్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, గణేష్ ప్రసాద్ రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, హరికృష్ణరెడ్డి, రాజారత్నంరెడ్డి, సుధాకర్‌రెడ్డి, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పది మూల్యాంకనం



విధులకు రిపోర్టు చేసుకుంటున్న టీచర్లు



పీసీఆర్ పాఠశాలలో మూల్యాంకన ఏర్పాట్లు

- పదో తరగతి పరీక్ష పేపర్లను దిద్దడానికి ఏర్పాట్లు సిద్ధం చేసిన విద్యాశాఖ అధికారులు
- ఈ నెల 8వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని పీసీఆర్‌లో మూల్యాంకనం
- జిల్లాకు 1,77,909 పది జవాబుపత్రాలు
- ఇందుకోసం 1910 మంది ఉపాధ్యాయుల కేటాయింపు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా 116 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 30వ తేదీతో ముగియడంతో జవాబుపత్రాల మూల్యాంకనంపై జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నెల 1వ తేదీ నుంచి జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూల్యాంకనం ప్రారంభించనున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఏప్రిల్ 8వ తేదీలోపు మూల్యాంకనం ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు ఉండడంతో విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టారు. పలు జిల్లాల నుంచి విచ్చేసిన జవాబుపత్రాల కోడింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. సోమవారం నుంచి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూల్యాంకనం ప్రక్రియ నిర్వహించనున్నారు.


నిబంధనలు ఇలా..

- మూల్యాంకన విధులకు హాజరయ్యే టీచర్లు సెల్‌ఫోన్లు, స్మార్ట్‌ఫోన్లు, వైట్‌నర్, ఎరేజర్ తదితర వస్తువులను తీసుకువెళ్లరాదు.
- మూల్యాంకనం లో ఎలాంటి తప్పిదాలు జరిగినా ఉపాధ్యాయులదే బాధ్యత.
- ఎగ్జామినర్ (సీఈఓలు), ఆరుగురు సహాయక ఎగ్జామినర్లు (ఏఈలు), ఇద్దరు స్పెషల్ అసిస్టెంట్లు (ఎస్పీఏ) పాల్గొంటారు. ప్రతి సహాయక ఎగ్జామినర్ రోజుకు 40 స్క్రిప్టులు మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది.

ముందస్తుగా విధుల రిపోర్ట్..

గతంలో ఎన్నడూ లేనివిధంగా మూల్యాంకనం ప్రారంభానికి ముందు రోజు విధులు కేటాయించిన టీచర్లు రిపోర్టు చేసుకోవాలని డీఈఓ దేవరాజు ఆదేశించారు. దీంతో జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి విధులకు కేటాయించిన ఆయా సబ్జెక్టుల టీచర్లు ఆదివారం జిల్లా కేంద్రంలోని పీసీఆర్‌కు విచ్చేశారు. కొందరు విధుల్లో చేరగా, మరికొందరు అనారోగ్య కారణాలతో విధులు వద్దని లిఖితపూర్వకంగా డీఈఓకు వినతి చేసుకున్నారు. వాటిని పరిశీలించేందుకు ప్రత్యేక కమిటీని కేటాయించారు. అలాగే ఈ ఏడాది వివిధ జిల్లాల నుంచి వచ్చిన 1,77,909 జవాబు పత్రాలను పీసీఆర్ మూల్యాంకనకేంద్రంలో దిద్దనున్నారు. ఇందుకోసం 1,910 మంది సబ్జెక్టు టీచర్లను జిల్లా విద్యాశాఖ నియమించింది.

పకడ్బందీగా ఏర్పాట్లు..



పదో తరగతి మూల్యాంకనంకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశాం. మూల్యాంకన కేంద్రంలో టీచర్లకు అన్ని వసతులు కల్పించాం. విధులకు కేటాయించిన టీచర్లు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు చేపట్టాం. ఈ నెల 8వ తేదీలోపు జిల్లాకు వచ్చిన జవాబుపత్రాలను పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతాం. – దేవరాజు, డీఈఓ, చిత్తూరు

పుంగనూరు జాతరకు భారీ ఏర్పాట్లు



పుంగనూరు సుగుటూరు గంగమ్మ



పుంగనూరు ప్యాలెస్

- 2, 3 తేదీల్లో సుగుటూరు గంగమ్మ జాతర
- లక్ష మంది భక్తులు జాతరకు వస్తారని అంచనా
- పటిష్ట ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

పుంగనూరు: పుంగనూరు పట్టణంలో కులమతాలకు అతీతంగా సుమారు ఎనిమిది శతాబ్దాలుగా జమీందార్ల కులదైవమైన శ్రీ సుగుటూరు గంగమ్మ జాతరను ఈనెల 2, 3 తేదీల్లో వైభవంగా నిర్వహించనున్నారు. ఈసారి కూడా అమ్మవారికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన సతీమణి స్వర్ణమ్మ కుటుంబ సమేతంగా హాజరై సారె సమర్పించనున్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ జాతరకు కర్ణాటక, తమిళనాడు నుంచి వేలాది మంది రానున్నారు.

జాతర ఇలా..

జమీందార్ల కుల దైవమైన సుగుటూరు గంగమ్మను మంగళవారం తొలుత ప్యాలెస్‌లో జమీందార్లు విజయరాణెమ్మ, సోమశేఖర్ చిక్కరాయులు, మల్లికార్జున రాయులు, వారి కుటుంబ సభ్యులు 2న మంగళవారం పూజలు నిర్వహిస్తారు. అనంతరం పట్టణంలో ఊరేగింపు నిర్వహించి, బుధవారం వేకువజామున నుంచి భక్తుల సందర్శనార్థం ఆలయంలోకి అనుమతిస్తారు. అమ్మవారికి బెస్తవారు, యాదవ కులస్తులు, తోటి కులస్తులచే పూజలు ఘనంగా నిర్వహిస్తారు. అలాగే బజారువీధిలో నడివీధి గంగమ్మ, తూర్పు మొగసాలలో గంగమ్మ, బాలాజీ థియేటర్ వద్ద మలారమ్మ గంగమ్మ, మైసూర్ బ్యాంకు వద్ద నలగంగమ్మ, బస్టాండులో విరూపాక్షి మారెమ్మ, నల్లరాళ్లపల్లె వద్ద నలగంగమ్మ, కోనేరు వద్ద బోయకొండ గంగమ్మ, నానాసాహెబ్‌పేటలోని నడివీధి గంగమ్మను కొలువు దీరుస్తారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు వేలసంఖ్యలో తరలివస్తారు. భక్తులు మట్టి కుండలకు మామిడి ఆకులు, వేపాకు, పూలతో గెరిగెలను అలంకరించి పలు వేషధారణల్లో వచ్చి ఆలయంలో మూడు ప్రదక్షిణలు చేసి అమ్మవారికి మొక్కులు చెల్లిస్తారు.

పటిష్ట ఏర్పాట్లు..

జాతరకు సుమారు లక్షమంది భక్తులు రానున్నట్లు అధికారులు అంచనా వేశారు. కమిషనర్ నరసింహ ప్రసాద్, సీఐ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో భారీగా ఏర్పాట్లు చేపట్టారు. పట్టణంలో ప్రత్యేక విద్యుత్ దీపాలు, చలువపందిళ్లు, వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు.

7న జాతీయస్థాయి ఉగాది పురస్కారాలు

చిత్తూరు కలెక్టరేట్ : తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన జాతీయ స్థాయి ఉగాది పురస్కారాల ప్రదాన కార్యక్రమం ఉంటుందని ఆ సమితి అధ్యక్షుడు తులసినాథం నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని పలమనేరులో ఉన్న కళామందిరంలో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన 20 మందికి పురస్కారాలు ప్రదానం చేస్తామన్నారు. ఇటీవల విద్యార్థులకు నిర్వహించిన జాతీయ స్థాయి వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన 50 మందికి బహుమతులు ఇవ్వనున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

హైవేపైకి ఒంటరి ఏనుగు

– గంటపాటు స్తంభించిన ట్రాఫిక్



గంటావూరు వద్ద రోడ్డుపై ఒంటరి ఏనుగు

పలమనేరు: పట్టణంలోని గంటావూరు సమీపంలో చెన్నై- బెంగళూరు హైవేపైకి కౌండిన్య అడవిలోంచి దారితప్పిన ఒంటరి ఏనుగు శనివారం రాత్రి వచ్చింది. హైవేలో వేగంగా వస్తున్న వాహనాలను చూసి ఎలా రోడ్డు దాటాలో తెలీక అక్కడే చాలాసేపు తచ్చాడుతూ గడిపింది. దీంతో అక్కడ కొందరు ఏనుగుతో సెల్ఫీలు తీసుకున్నారు. ఎట్టకేలకు వాహనాలను కాసేపు దూరంగా ఆపడంతో ఊపిరి పీల్చుకున్న ఏనుగు రోడ్డును దాటింది. గంటపాటు ఏనుగు రోడ్డుపై ఉన్నప్పటికీ స్థానిక అటవీశాఖ అధికారులు, ట్రాకర్స్ అక్కడికి రాకపోవడం కొసమెరుపు.

వైఎస్సార్‌సీపీలోకి పోటెత్తిన చేరికలు


వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన, కాంగ్రెస్ నాయకులతో మంత్రి రోజా


ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు

- మంత్రి రోజా సమక్షంలో టీడీపీ ఎంపీటీసీతో సహా పలువురు..
- పుత్తూరులో జనసేన, కాంగ్రెస్ పార్టీల నుంచి 300 మందికి ఆహ్వానం
- గంగవరంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో 70 కుటుంబాలు చేరిక
- కుప్పంలో ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో 25 కుటుంబాలు చేరిక

పుత్తూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి ఆ పార్టీ ఈ పార్టీ అనే తారతమ్యం లేకుండా అన్ని పార్టీల నాయకుల చేరికలు ఊపందుకున్నాయి. ఆదివారం జిల్లావ్యాప్తంగా జనసేన, టీడీపీల నుంచి పెద్దఎత్తున వైఎస్సార్‌సీపీలో చేరారు. పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా సమక్షంలో పుత్తూరు మండలం తడుకుకు చెందిన తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ సుబ్బరత్నమ్మ, గంగాధరం దంపతుల బృందంతో పాటు, జనసేన, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 300 మంది నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ప్రతి ఒక్కరినీ మంత్రి రోజా పేరుపేరునా వేదికపైకి పిలిచి పార్టీ కండువాలను కప్పుతూ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ సీఎం జగనన్న పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని తెలిపారు. కార్యక్రమంలో పుత్తూరు రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు గోవిందస్వామిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, పార్టీ నాయకులు ప్రభురాజు, రవీంద్ర, జయప్రకాష్, రాంబత్తయ్య, నాని, బాబు, పార్తీబన్‌రెడ్డి, చంద్ర, వీరాస్వామి, మోహన్‌రాజు, గిరిబాబు, హరిభత్తారెడ్డి, హరి, శరవణ పాల్గొన్నారు.

పాలసముద్రంలో 50 మంది చేరిక..

పాలసముద్రం : మండల పరిధిలో టీడీపీకి చెందిన పలువురు ఆదివారం డెప్యూటీ సీఎం నారాయణస్వామి, జీడీ నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో టీడీపీ నాయకులు బాబునాయుడు, వరాలు నాయుడు, రమేష్‌రెడ్డి, క్రిష్ణయ్యరెడ్డి, చిన్నబ్బమండడి, గోవిందమండడి, ఆరుముగం, రమేష్, గోపి తదితరులు 50 మంది వరకు ఉన్నారు. కార్యక్రమంలో ఆర్బీకే చైర్మన్ పోలయ్య, సర్పంచ్ గాలి మహేష్, నాయకులు, వనదుర్గాపురం, తొట్టికండ్రిగ, బలిజకండ్రిగ, కృష్ణజమ్మాపురం యువకులు పాల్గొన్నారు.

70 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి..

గంగవరం: ఐదేళ్ల జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పాలన, అభివృద్ధికి ఆకర్షితులై తాము కూడా జగనన్న వెంటే నడుస్తాం అంటూ టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. ఆదివారం గంగవరం, కీలపట్ల పంచాయతీల్లోని చిన్నూరు, మన్నార్‌నాయనిపల్లి, నడింపల్లి, డ్రైవర్స్‌కాలనీ, రెంటకుంట్ల, నల్లసానిపల్లి మొత్తం 6 గ్రామాల నుంచి దాదాపు 70 కుటుంబాల ప్రజలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. చిన్నూరు గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు వైఎస్సార్‌సీపీలో చేరగా ఎమ్మెల్యే వెంకటేగౌడ వారికి కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, బోస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వేలు, సూరి, నాగరాజు, గిరి, మల్లికార్జున, ఆనంద, బాబు, రెడ్డి, రవి, నూరాని, అహ్మద్, రమణ, రాజు, చెన్నకేశవ, శంకర, అమర పాల్గొన్నారు.

టీడీపీలో ఉండలేం....

యాదమరి(పూతలపట్టు): మొదటి నుంచి తాము టీడీపీలో ఉంటున్నా ఇప్పటివరకు ఎలాంటి న్యాయం జరగలేదని, ఆ పార్టీని నమ్ముకుని బతకలేమని యాదమరి మండలం కొటాల దళితవాడకు చెందిన గ్రామస్తులు తెలిపారు. ఆదివారం జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయరెడ్డిని వారు మర్యాదపూర్వకంగా కలిశారు. వారు మాట్లాడుతూ తాము ఎప్పటి నుంచో టీడీపీ కోసం కష్టపడి పనిచేసి గెలిపిస్తున్నామని తెలిపారు. కానీ తమకు టీడీపీలో ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. అందుకే టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో తాము చేరేందుకు అవకాశం కల్పించాలని ధనంజయరెడ్డికి విన్నవించుకున్నారు. దీనిపై ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో చేరేందుకు ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్‌తో మాట్లాడి అన్నివిధాలా సహకరిస్తానన్నారు.

25 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి..

రామకుప్పం: మండలంలోని బందార్లపల్లి పంచాయతీ కృష్ణానగర్‌కు చెందిన 25 టీడీపీ కుటుంబాలు ఆదివారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి ఆధ్వర్యంలో కుప్పం ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్సీ భరత్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరినట్లు తెలిపారు. అదేవిధంగా ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కుప్పం ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ గెలుపునకు తాము శాయశక్తులా కృషి చేస్తామని అన్నారు. పార్టీలో చేరిన వారిలో రోహిణప్ప, శంకర్, రాజ్‌కుమార్, కార్తీక్, మురుగేష్, శ్రీనివాసులు, సురేష్, వెంకటరామప్ప, కృష్ణప్ప ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచ్ రాజ్‌గోపాల్, పార్టీ మండల కో–కన్వీనర్ చంద్రారెడ్డి, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, నేతలు సతీష్, రామకృష్ణారెడ్డి, మురుగేష్, శ్రీవర్ధన్, హేమాచలపతి, చెంగారెడ్డి పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్సీ భరత్


జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డిని కలిసిన కొటాల ప్రజలు


వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న జీడీనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత


కర్ణాటక మద్యాన్ని చూపుతున్న డీఎస్పీ శ్రీనాథ్

గుడుపల్లె: కర్ణాటక సరిహద్దులో ఉన్న బిసానత్తం గ్రామం వద్ద ఎన్నికల నిబంధనల మేరకు ఆదివారం వాహన తనిఖీలు చేపట్టగా కర్ణాటక నుంచి 4 ద్విచక్రవాహనాల్లో సంచుల్లో తెస్తున్న మద్యాన్ని ఎన్నికల టీం సభ్యులు అబ్దుల్ రహీమ్ పట్టుకున్నారు. వాహనాలతో పాటు వ్యక్తులను అదుపులోకి తీసుకుని గుడుపల్లె పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కుప్పం డీఎస్పీ శ్రీనాథ్, సీఐ ఈశ్వర్‌రెడ్డి, ఎస్‌ఐ లక్ష్మీకాంత్ మద్యం పట్టివేతపై విచారించారు. కనమనపల్లె గ్రామానికి చెందిన తాండవకృష్ణ, రాజశేఖర్, మంజునాథ్, రమేష్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి టెట్రాప్యాకెట్లు, 90 ఎంఎల్, 180 ఎంఎల్ బాటిళ్లు ఉన్న 29 బాక్సులు, అలాగే మరో 17 బాక్సులను స్వాధీనం చేసుకోగా, మద్యం విలువ రూ.1.66 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. 4 బైక్‌లతో పాటు నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

మామిడి తోట దగ్ధం


కాలిపోయిన మామిడి తోట

- ఆకతాయిల చేష్టలతో రైతుకు రూ.3 లక్షల నష్టం

పెనుమూరు(కార్వేటినగరం) : మామిడి తోట దగ్ధం కావడంతో రూ.3 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లిన సంఘటన మండల పరిధిలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. చిన్నమరెడ్డికండ్రిగ గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి కుమారుడు ఉదయచంద్రారెడ్డికి 134/2 సర్వేనంబర్‌లో రెండున్నర ఎకరాల మామిడి తోట ఉంది. శనివారం సాయంత్రం గుర్తు తెలియని ఆకతాయిలు తోటకు నిప్పు పెట్టడంతో మామిడి తోటలోని అన్ని చెట్లు పూర్తిగా కాలిపోయాయి. అలాగే మామిడి చెట్లకు నీరందించడానికి ఏర్పాటు చేసిన డ్రిప్పు పైపులు కూడా కాలిపోవడంతో సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు రైతు కన్నీరు మున్నీరయ్యారు. అరకొర సేద్యంతో జీవనం గడుపుతున్న తమకు ఆకతాయిల చేష్టల వల్ల ఇంత పెద్ద మొత్తంలో ఆస్తి నష్టం వాటిల్లిందని వాపోయారు.

రాళ్ల దాడిపై ఫిర్యాదు


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వనిత భర్త శీను

కుప్పంరూరల్: వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వనిత, ఆమె భర్త శీను శనివారం రాత్రి ప్రచారం ముగించుకుని స్వగ్రామానికి వెళ్తుండగా, ఆడమండల కుప్పం వద్ద టీడీపీ మూకలు రాళ్ల దాడికి పాల్పడ్డాయి. దీనిపై వనిత భర్త శీను ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమను టార్గెట్ చేసుకుని టీడీపీకి చెందిన చిల్లర మూకలు కారుపై దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో మల్లానూరు అండర్ బ్రిడ్జి వద్ద తమ కారుపై రాళ్ల దాడి జరిగిందని, శనివారం రాత్రి అదే తరహాలో తనను, తన భార్యను టీడీపీ అల్లరిమూకలు అంతమొందించాలని చూస్తున్నారని ఆరోపించారు. తమకు రక్షణ కల్పించి, నిందితులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

భార్యాబిడ్డలపై మాజీ కౌన్సిలర్ దాష్టీకం

చిత్తూరు అర్బన్: ఆస్తి విషయమై ప్రశ్నించినందుకు కట్టుకున్న భార్య, కన్న బిడ్డలను చావబాదాడో మాజీ కౌన్సిలర్. చిత్తూరు నగరంలో చోటు చేసుకున్న ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. టూటౌన్ సీఐ ఉలసయ్య కథనం మేరకు.. సంతపేటకు చెందిన మాజీ కౌన్సిలర్ శరవణ డబ్బులు విచ్చలవిడిగా ఖర్చు చేస్తుండడంతో ఆర్థిక పరిస్థితి దెబ్బతింటోందని భార్య, పిల్లలు హెచ్చరించారు. శనివారం రాత్రి ఇదే విషయమై కుటుంబ సభ్యులకు, శరవణకు మధ్య వాగ్వాదం జరిగింది. ఆగ్రహించిన శరవణ, అతని అన్న చెందామరై, అన్న కొడుకు దిలీప్ కలిసి.. శరవణ భార్య, ముగ్గురు పిల్లలపై దాడికి పాల్పడ్డారు. గాయపడిన వాళ్లు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తమపై దాడి చేసిన తండ్రి శరవణ, పెదనాన్న చెందామరై, దిలీప్‌పై చర్యలు తీసుకోవాలని శరవణ కుమార్తె శంకరిప్రియ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని..

శాంతిపురం: ద్విచక్రవాహనంలో వెళ్తున్న వారిని మద్యం మత్తులో ఉన్న మరో వ్యక్తి బైకుపై వచ్చి ఢీకొనడంతో ముగ్గురు గాయపడిన ఘటన కుప్పం– పలమనేరు జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. గుడుపల్లి మండలం జోగ్యానూరుకు చెందిన మురుగేష్(47), రఫీక్ అహ్మద్(55) సొంత పని మీద బైక్‌పై వెళ్తుండగా కూతేగానిపల్లి క్రాస్ వద్ద ఎంకే పురం గ్రామానికి చెందిన తిరుపతి(36) వేగంగా వచ్చి వీరి బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో మురుగేష్, రఫీక్‌కు కుడి కాళ్లు పూర్తిగా విరిగిపోయాయి. మరో బైక్‌తో ఢీకొట్టిన తిరుపతికి గాయాలయ్యాయి. అతిగా మద్యం సేవించి, రాంగ్ రూట్‌లో రావడంతోనే ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది గాయపడిన ముగ్గురినీ కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సిఫార్సు మేరకు తీవ్రంగా గాయపడిన మురుగేష్‌ను కుటుంబ సభ్యులు బెంగళూరు ఆస్పత్రికి తీసుకుపోయారు.

కారు ఢీకొని మహిళ మృతి


చిన్నపాపమ్మ మృతదేహం

పూతలపట్టు: గుర్తుతెలియని కారు ఢీకొనడంతో మహిళ మృతి చెందిన ఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ రమణారావు వివరాల మేరకు.. పూతలపట్టు మండలం ఒంటిళ్ల గ్రామానికి చెందిన చిన్నబ్బ శెట్టి భార్య పి.చిన్నపాపమ్మ(68) శనివారం రాత్రి సుమారు 11.30 గంటల ప్రాంతంలో బాటగంగమ్మ ఆలయం వద్ద హైవే రోడ్డు దాటుతోంది. అదే సమయంలో తిరుపతి వైపు నుంచి చిత్తూరుకు వెళ్తున్న కారు ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కారును అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గురజాల.. ఏమిటీ గోల..


బైకును వేగంగా నడుపుతూ చేతులు వదిలేసి స్టంట్స్ చేస్తున్న చిత్తూరు టీడీపీ అభ్యర్థి గురజాల


నంబర్ ప్లేట్ లేని బైక్ నడుపుతున్న గురజాల

చిత్తూరు అర్బన్: చిత్తూరు టీడీపీ అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ నాయుడు (జీజేఎం) ఇటీవల సామాజిక మాధ్యమాల్లో చేసిన పోస్టులు వెర్రి తలకెక్కినట్లు అనిపిస్తున్నాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా చిత్తూరులో జీజేఎం బైక్ స్టంట్లు యువతను పెడదారిన పట్టించేలా ఉన్నాయి. ఇటీవల ఆయన ఓ ద్విచక్రవాహనాన్ని ఇష్టానుసారం నడపడంపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర విమర్శలకు దారి తీయడంతో పాటు యువత తల్లిదండ్రులు దుమ్మెత్తి పోస్తున్నారు. బైకును వేగంగా నడపడంతో పాటు రెండు చేతులు వదిలేసి స్టంట్స్ చేయడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. బైకు నడిపేటపుడు హెల్మెట్ తప్పనిసరి అనేది నిబంధన. దీన్ని పక్కన పెట్టి, నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారిపై మోటారు వాహన చట్టం నిబంధనలను ఉల్లంఘించి బైక్ నడిపారు. అతని వెనుక వస్తున్న అనుచరులు ఆ స్టంట్స్‌ను ఓ కెమెరాతో షూట్ చేసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. పైగా గురజాల నడిపిన బైక్‌కు నంబర్ ప్లేట్ లేదు. బైక్ ఇంకా రిజిస్ట్రేషన్ కాలేదా ? ఉద్దేశ పూర్వకంగా నంబర్ ప్లేటు తీసేసి నడిపారా ? అని తెలియడం లేదు. మరోవైపు ఈ వీడియో ఆధారంగా మోటారు వాహన చట్టాన్ని ఉల్లంఘించిన జీజేఎంపై రవాణా శాఖ, పోలీసు అధికారులు చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

బోయకొండలో భక్తుల రద్దీ


గంగమ్మకు ఆభరణాలను వితరణ చేస్తున్న దాతలు

చౌడేపల్లె : కోరిన కోర్కెలు తీర్చే ఆరాధ్య దైవం శ్రీ బోయకొండ గంగమ్మతల్లి దీవెనలకోసం భక్తులు ఆదివారం భారీగా విచ్చేశారు. ఆంధ్రా, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలనుంచి వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం రావడంతో బోయకొండ ఎటుచూసినా జనసంద్రమైంది. ఒక్కరోజే సుమారు 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనెదీపాలు వెలిగించి మేళతాళాల నడుమ జంతు బలులిచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఆభరణాల విరాళం

బోయకొండ గంగమ్మకు తెలంగాణ రాష్ట్రం హైదరాబాదుకు చెందిన మహాలక్ష్మి, సౌజన్యరెడ్డి ఆభరణాలను ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, చైర్మన్ చంద్రమౌళికి విరాళంగా అందజేశారు. తన కోరిక ఫలించడంతో అమ్మవారికి రూ:50 వేలు విలువ చేసే బంగారు తాళి బొట్టు, వెండి మెట్టు అందజేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి మొక్కులు చెల్లించారు. అలాగే హైదరాబాదుకు చెందిన హారిక, షరాజాన్ రూ.లక్ష విలువ చేసే 40స్టీల్ టేబుళ్లు, 100 కుర్చీలు ఆలయానికి విరాళంగా అందజేసినట్లు చైర్మన్ వెల్లడించారు. ఈ సందర్భంగా దాతలను ఘనంగా సత్కరించి పవిత్ర తీర్థప్రసాదాలను అందజేశారు.

కంటైనర్–కారు ఢీ

– తల్లీ కుమారుడికి గాయాలు


బంగారుపాళెం: ప్రమాదంలో గాయపడిన లక్ష్మి

బంగారుపాళెం : మండలంలోని కొత్తపల్లె ఫ్లైఓవర్‌పై చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీ కుమారులు గాయపడ్డారు. వివరాలు ఇలా.. చెన్నైలోని టీనగర్‌కు చెందిన లక్ష్మి చిన్న కుమారుడు రేవంత్ అన్నమయ్య జిల్లా మదనపల్లె రిషివ్యాలీ స్కూల్‌లో పదోతరగతి చదువుతున్నాడు. పరీక్షలు ముగియడంతో ఇంటికి తీసుకు వచ్చేందుకు లక్ష్మి, పెద్దకుమారుడు విశ్వేశ్వర్‌తో కలసి కారులో మదనపల్లెకు వచ్చారు. తిరిగి కుమారులతో కలసి చెన్నైకి వెళ్తుండగా మార్గమధ్యలో కొత్తపల్లె బ్రిడ్జిపై ముందు వెళ్తున్న కంటైనరు (టీఎన్69జెడ్7367)ను వెనుక వస్తున్న వీరి కారు(టీఎన్09బిటి5547)ఢీకొంది. ఈ ప్రమాదంలో విశ్వేశ్వర్, రేవంత్‌కు స్వల్ప గాయాలు కాగా లక్ష్మికి ఎడమ చేయి విరిగింది. ముఖానికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి రెఫర్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.